సాక్షి
బాపట్ల

ఆదివారం । 10 । ఆగస్టు । 2025



వైభవంగా శ్రీవారి కల్యాణం

దుగ్గిరాల : పసుపు యార్డు సమీపంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామికి శనివారం కల్యాణం నిర్వహించారు. శ్రీనివాసరావు, అంజనాదేవి దంపతులు పాల్గొన్నారు.



పశ్చిమ డెల్టాకు నీటి విడుదల

దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి శనివారం పశ్చిమ డెల్టాకు 7,713 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు.



శ్రీలక్ష్మీనారాయణులకు అభిషేకాలు

నగరంపాలెం: అరండల్‌పేట శ్రీఅష్టలక్ష్మీ మందిరంలో శ్రావణ పూర్ణిమ సందర్భంగా కోటి కుంకుమార్చనలో భాగంగా శ్రీలక్ష్మీ నారాయణులకు అభిషేకాలు జరిగాయి.

న్యూస్‌రీల్

బాలచాముండేశ్వరి అమ్మవారికి గాజులతో అలంకారం



అమరావతి: శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని అమరేశ్వరాలయంలోని బాల చాముండేశ్వరి దేవిని శనివారం గాజులతో శ్రావణ లక్ష్మీగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో రేఖ మాట్లాడుతూ బాల చాముండేశ్వరి దేవికి అలంకరించిన గాజులను రేపటి నుంచి ముత్తయిదువలకు పంపిణీ చేస్తామన్నారు.

దుర్గమ్మకు కానుకగా బంగారు కాసుల పేరు




ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు గుంటూరుకు చెందిన భక్తులు శనివారం రూ.ఐదు లక్షల విలువైన బంగారు కాసుల పేరును కానుకగా అందచేశారు. గుంటూరు దేవపురానికి చెందిన జీఎస్ కామరాజ్ దంపతులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ ఈవో శీనానాయక్‌కు బంగారం, పగడాలు, కెంపులతో తయారు చేయించిన 48 గ్రాముల కాసుల పేరును అందచేశారు. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు.

నాగార్జున కొండకు పర్యాటకులు రాక




విజయపురిసౌత్: ప్రపంచ పర్యాటక కేంద్రం నాగార్జునకొండకు శనివారం పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వీరి ద్వారా లాంచీస్టేషన్‌కు 45,000 రూపాయల ఆదాయం చేకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు. కొండను సందర్శించిన పర్యాటకులు మహాస్తూపం, అశ్వమేధ యాగశాల, స్నానఘట్టం, మ్యూజియంలోని 9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, బుద్ధుని జీవిత చరిత్రకు సంబంధించిన శిలాఫలకాలను తిలకించారు. అనంతరం మాచర్ల మండలంలోని అనుపు, ఎత్తిపోతల జలపాతాన్ని వీక్షించారు.

అమ్మవారి ఆలయ సింహద్వార స్థాపన మహోత్సవం



నరసరావుపేట రూరల్: ఇస్సపాలెం మహంకాళీ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా శనివారం గర్భాలయ రాతి సింహద్వారం స్థాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గర్భాలయ సింహ ద్వారాలకు మహిళలు పసుపు రాసి పూజలు జరిపారు. అనంతరం గుమ్మ ముహూర్తంలో సింహ ద్వారాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొన్నారు. ముందుగా మహంకాళీ అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నలబోతు మాధవి దేవి, అర్చకులు కొత్తలంక కార్తికేయ శర్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు తెరుచుకోనున్న సాగర్ క్రస్ట్ గేట్లు



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి నీటి ప్రవాహం పెరగడంతో ఆదివారం మళ్లీ ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను అధికారులు తెరవనున్నారు. ఉదయం 5 గంటలకు రెండు క్రస్ట్ గేట్లు ఎత్తి, నీటిని దిగువకు విడుదల చేయనున్నారు. ఈ సీజన్‌లో గేట్లు రెండో సారి తెరవనున్నారు. ప్రస్తుతం రాత్రి 8 గంటలకు సాగర్ నీటి మట్టం 589.80 అడుగులు ఉండగా, ఇది 311.4474 టీఎంసీలకు సమానం.

అంతిమ ప్రయాణం

రహదారి ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం

పుట్టెంట్రుకలు తీయడానికి ఆలయానికి వెళ్తుండగా చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృత్యువాత పడ్డారు. చాగల్లు వద్ద ట్రాలీని తుఫాన్ వాహనం ఢీకొట్టడంతో వారి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ఈ ప్రమాదంలో అక్కడికక్కడే ఇద్దరు మృతి చెందగా, ఆస్పత్రికి తరలిస్తుండగా ఒకరు, వైద్యశాలలో చికిత్స పొందుతూ శనివారం మరో ఇద్దరు మృతి చెందారు. ఒకే కుటుంబానికి చెందిన వారు ఇలా చనిపోవడంతో తీవ్ర విషాదం నెలకొంది.

- మృతులందరూ ఒక్క కుటుంబానికి చెందిన వారే
- బాలుడి పుట్టెంట్రుకలు తీయడానికి వెళ్తుండగా దుర్ఘటన
- ప్రమాదంలో మూడేళ్ల చిన్నారి కూడా మృత్యువాత
- ఘోర ప్రమాదంతో కకావికలమైన కుటుంబం



రోధిస్తున్న బంధువులు



వాహనాన్ని పక్కకు తీస్తున్న క్రేన్ (ఇన్‌సెట్లో) ట్రాలీ

ఉలవపాడు/మాచవరం: పల్నాడు జిల్లా మాచవరం మండలం కొత్తగణేశునిపాడుకు చెందిన నంబుల చిన వెంకటేశ్వర్లు, సుభాషిణి దంపతుల కుమారుడు తేజస్విని అభినయ్‌కృష్ణకు పుట్టెంట్రుకలు తిరుమలలో తీయించాలని నిర్ణయించారు. కుటుంబ సభ్యులతో కలిసి 11 మంది తుఫాన్ వాహనంలో బయలుదేరారు. ప్రకాశం జిల్లా ఉలవపాడు దాటి చాగల్లు సమీపంలో ముందు వెళుతున్న ట్రాలీ లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఢీకొంది. తర్వాత వారి వాహనం బోల్తాకొట్టింది.

కుటుంబం కకావికలం...

చిన వెంకటేశ్వర్లు, సుభాషిణిలు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. కష్టపడి సచివాలయంలో ఉద్యోగాలు సంపాదించుకున్నారు. పిడుగురాళ్లలో చిన వెంకటేశ్వర్లు వెల్ఫేర్ అసిస్టెంట్‌గా, సుభాషిణి డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఇద్దరూ సంతోష జీవితం గడపాల్సిన సమయంలో ప్రమాదం ఆ కుటుంబాన్ని కకావికలం చేసింది. చిన వెంకటేశ్వర్లు తన కుమారుడు, భార్య, తల్లిని పోగొట్టుకున్నారు. సుభాషిణి తండ్రి కూడా ప్రాణాలు కోల్పోయాడు. చిన వెంకటేశ్వర్లు వదిన కూడా చనిపోయింది.

రైలులో వెళ్లాలని భావించినా..

ముందు తిరుపతికి రైలులో వెళ్లాలనుకుని ప్లాన్ చేసుకున్నారు. రైలు అయితే ఇబ్బందులు ఉండవని చిన వెంకటేశ్వర్లుకు సోదరుడు చెప్పాడు. కానీ చిన్న పిల్లలు ఇబ్బంది పడతారని, కారులో ప్రశాంతంగా నిద్రపోతారు కదా.. అని పేర్కొనడంతో పిడుగురాళ్లకు చెందిన గంగరాజు తుఫాన్ వాహనాన్ని బాడుగకు మాట్లాడుకున్నారు. 9 గంటలకు బయలుదేరారు. మధ్యలో టీ తాగేందుకు ఆగారు. మళ్లీ బయలుదేరిన అరగంటలోపే ప్రమాదం జరిగింది. రైలులో వెళ్లి ఉంటే ఈ ప్రమాదం తప్పి ఉండేదని మిగతా కుటుంబసభ్యులు, బంధువులు వాపోతున్నారు.

మృతదేహాలు అప్పగింత...

ఉలవపాడు సీహెచ్‌సీ వైద్యశాలలో వెంకట నరసమ్మ, సుభాషిణి, తేజస్విని అభినయ్ కృష్ణ మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. గ్రామం నుంచి బంధువులు వచ్చి మృతదేహాలను చూసి చలించిపోయారు. నెల్లూరులో యర్రం శ్రీనివాసరావు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. రుక్మిణమ్మ గుంటూరులో సాయంత్రం చికిత్స పొందుతూ మృతి చెందింది. ఇంకా పోస్టుమార్టం నిర్వహించలేదు. ఉలవపాడు వైద్యశాలలో వారి బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.

మృతుల వివరాలివీ...

ప్రమాద స్థలిలోనే చిన వెంకటేశ్వర్లు తల్లి వెంకట నరసమ్మ (55), భార్య సుభాషిణి (30)లు మృతి చెందారు. చిన వెంకటేశ్వర్లు కుమారుడు తేజస్విని అభినయ్‌కృష్ణ (3)ను కావలి ఏరియా వైద్యశాలకు తరలిస్తున్న సమయంలో మృతి చెందాడు. ఆయన వదిన రుక్మిణమ్మ (35) గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచింది. మామ యర్రం శ్రీనివాసరావు (58) నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. శ్రీనివాసరావు స్వస్థలం గణేశునిపాడు పక్కనే ఉన్న అగ్రహారం గ్రామం.



మృతులు సుభాషిణి



వెంకట నరసమ్మ



తేజస్విని అభినయ్‌కృష్ణ



శ్రీనివాసరావు



రుక్మిణమ్మ

ఆర్వోబీ నిర్మాణంలో హైకోర్టు ఆదేశాల ఉల్లంఘన



మాట్లాడుతున్న ఎల్ఎస్ భారవి

గుంటూరు ఎడ్యుకేషన్: నగరంలోని శంకర్ విలాస్ ఫ్లయ్ ఓవర్ నిర్మాణానికి సంబంధించిన కేసు హైకోర్టులో విచారణలో ఉండగానే కూల్చివేత పనులు ప్రారంభించిన అధికార యంత్రాంగం కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తోందని బెటర్ శంకర్‌విలాస్ ఫ్లయ్ ఓవర్ సంయుక్త కార్యాచరణ సమితి (జేఏసీ) కన్వీనర్ ఎల్ఎస్ భారవి అన్నారు. శనివారం అరండల్‌పేటలోని ఓ హోటల్లో జరిగిన మీడియా సమావేశంలో భారవి మాట్లాడుతూ.. పనుల్లో నగరపాలక సంస్థ, ఆర్ అండ్ బీ అధికారులు పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. సేతు బంధన్ ప్రాజెక్టు కింద బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసిన కేంద్రం విధించిన నిబంధనలను పాటించకుండా, ప్రజలకు ప్రత్యామ్నాయ మార్గాలను చూపకుండా కూల్చివేత పనులు చేపట్టారని అన్నారు. ప్రజా రవాణాకు ఇబ్బందులు లేకుండా ఇరువైపులా 12 అడుగులతో కూడిన రోడ్లను అందుబాటులోకి తీసుకువస్తామని హైకోర్టుకు అఫిడవిట్ సమర్పించిన అధికారులు కోర్టును సైతం తప్పుదారి పట్టించారన్నారు. హైకోర్టు స్టే ఎత్తివేసిందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అరండల్‌పేట, బ్రాడీపేటలను కలుపుతూ మార్గాలను ఏర్పాటు చేయాలని చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. ముందుగానే రైల్వేగేటు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నియమించిన కన్సల్టెన్సీ చేసిన సూచనలు బుట్టదాఖలు చేశారన్నారు. జేఏఈ కో-కన్వీనర్ ఎన్వీ కమల్‌కాంత్ మాట్లాడుతూ ఈ నెల 20న న్యాయస్థానం విచారణ జరిపి, తీర్పు వెలువరించనున్న నేపథ్యంలో పనులు ప్రారంభించేశారని చెప్పారు. సమావేశంలో జేఏసీ ప్రతినిధి వల్లూరి సదాశివ రావు, అరండల్‌పేట, బ్రాడీపేట షాప్ ఓనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బెల్లంకొండ శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు అండగా ప్రభుత్వం

ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ గంగాధర్‌గౌడ్



ఆదివాసీలతో ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ గంగాధర్ గౌడ్

బాపట్ల: ఆదివాసీలకు అండగా ప్రభుత్వం ఉంటుందని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ గంగాధర్‌గౌడ్ పేర్కొన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆదివాసీల సాంస్కృతిక జీవనాన్ని, హక్కులను పరిరక్షించాలనే లక్ష్యంతో ఐక్యరాజ్య సమితి నిర్ణయం మేరకు ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఆగస్టు 9న ప్రతి ఏటా జరుపుకొంటున్నామని అన్నారు. ప్రజల కోసం పోరాటాలు చేసే వాళ్లు చరిత్రలో నిలిచిపోతారని పేర్కొన్నారు. ఏకలవ్యుడు, అల్లూరి, వెన్నెలకంటి స్ఫూర్తితో ముందుకెళ్లాలని అన్నారు. ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలకు, నిరాడంబరతకు నిలువుటద్దంగా నిలిచే జీవనశైలి ఆదివాసీల సొంతం అని అన్నారు. కూటమి ప్రభుత్వం ఆదివాసీల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ కోసం నిత్యం కృషి చేస్తుందని అన్నారు. ఆదివాసీ కళలు, జీవన విధానాన్ని కాపాడుకుంటేనే మన ఉనికిని కాపాడుకున్న వారమవుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, అధికారులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలతో దగా

- మోసపోయానంటూ రైతు ఆవేదన
- విక్రయదారులపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘం డిమాండ్



శ్రీనివాసరావు మార్టూరులో కొనుగోలు చేసిన విత్తనాలు

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులోని ఓ విత్తనాల దుకాణంలో గుమ్మడి విత్తనాలు సాగు చేసినా మొలక రాక పోవడంతో మోసపోయానంటూ శనివారం ఓ రైతు విలేకరులను, రైతు సంఘం నాయకులను ఆశ్రయించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని బొల్లాపల్లి గ్రామానికి చెందిన రైతు వీరవల్లి శ్రీనివాసరావు జూలై 24వ తేదీ మార్టూరులో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సీడ్స్ దుకాణంలో 100 గ్రాముల గుమ్మడి విత్తనాలు 1,300 రూపాయల చొప్పున 9 ప్యాకెట్లు కొన్నారు. దీనికి రూ. 11,700 చెల్లించారు. వాటిలోని ఏడు ప్యాకెట్ల విత్తనాలను అదే రోజు తన ఒకటిన్నర ఎకరాల్లో నాటారు. వారం రోజుల వరకు విత్తనాలు మొలక రాకపోవడంతో అదే నెల 31వ తేదీన పాలం దున్నారు. చిలకలూరిపేట నుంచి తెచ్చిన వేరే కంపెనీ గుమ్మడి విత్తనాలతోపాటు గతంలో తన వద్ద మిగిలి ఉన్న రెండు ప్యాకెట్ల విత్తనాలను కలిపి ఈ నెల 1వ తేదీన విడివిడిగా రెండు చోట్ల నాటారు. మార్టూరు నుంచి తెచ్చిన విత్తనాలు ఈ నెల 8వ తేదీ వరకు మొలక రాకపోవడం, చిలకలూరిపేట నుంచి తెచ్చిన విత్తనాలు మొలక రావడంలోని తేడా గమనించారు. మార్టూరులో కొనుగోలు చేసిన విత్తనాల వల్ల తాను మోసపోయినట్లు గుర్తించారు. దుకాణ యజమానిని శ్రీనివాసరావు కలిశారు. కంపెనీ ప్రతినిధులతో కలిసి శనివారం బొల్లాపల్లిలోని పొలం వద్దకు వెళ్లి పరిస్థితిని దుకాణ యజమాని పరిశీలించారు. అయితే తనకు సరైన సమాధానం చెప్పకుండానే వెళ్లిపోయారని రైతు శ్రీనివాసరావు ఆరోపించారు. ఈ విషయమై మండల రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ నకిలీ విత్తన విక్రయాలదారులపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే ప్రత్యక్ష కార్యాచరణకు దిగాల్సి ఉంటుందని హెచ్చరించారు.

సాయినాథునికి బోనాలు

పట్టణంలోని పాపరాజుతోటలో ఉన్న శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో శనివారం బోనాల పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. షిరిడీలో సాయినాథుని పాదుకలు ప్రతిష్ఠించిన రోజు, శ్రావణ పౌర్ణమి సందర్భంగా బాబాకు పూజలు, అభిషేకాలను నిర్వహించారు. అనంతరం సాయినాథుడిని కూరగాయలతో అలంకరించారు. 116 మందితో బోనాల ఊరేగింపు నిర్వహించారు. - చీరాల అర్బన్



చెస్‌లో మరో యువ కెరటం

- భారతీయ చెస్‌లో ఒక కొత్త తార అజయ్ సంతోష్ పర్వతరెడ్డి
- తాజాగా ఇంటర్నేషనల్ మాస్టర్‌గా మూడోసారి అర్హత



సెర్బియాలో ఇంటర్నేషనల్ మాస్టర్‌గా అర్హత సాధించి సర్టిఫికెట్ అందుకుంటున్న అజయ్ సంతోష్

చినగంజాం: చెస్ బోర్డు ముందు కూర్చొని కేవలం గేమ్ ముక్కలు కదిపే కుర్రవాడు కాదు, గెలుపు పథకాలు వేసే మాస్టర్ మైండ్. ప్రతి గేమ్‌లోనూ ఎదుటి వాడికి సింహ స్వప్నం, గెలుపే అతని లక్ష్యం. తాజాగా తన మూడో ఇంటర్నేషనల్ మాస్టర్ నార్మ్ సాధించి ఇంటర్నేషనల్ మాస్టర్ బిరుదుకు అర్హత సాధించాడు. ఇంకా ఇదే ఆరంభం అంటూ చెస్ ప్రపంచానికి చాటి చెబుతున్నాడు.

బాపట్ల జిల్లా చినగంజాం మండలం సోపిరాల గ్రామానికి చెందిన విశ్రాంత బ్యాంక్ మేనేజర్ పర్వతరెడ్డి కాంతారావు మనవడు పర్వత రెడ్డి అజయ్ సంతోష్. తన తల్లిదండ్రులు మయూర్, సంధ్యారాణిలు కాగా తండ్రి ఉద్యోగ రీత్యా ఢిల్లీలో ఉంటున్నారు. సెర్బియాలో అంతర్జాతీయ స్థాయిలో రుడార్ 22 గ్రాండ్ మాస్టర్ రౌండ్ రాబిన్ పోటీలు జూలై 31 నుంచి ఆగస్టు 7వ తేదీ వరకు నిర్వహించారు. ఉక్రెయిన్, అమెరికా, రష్యా, సెర్బియా, ఇండియాకు చెందిన మొత్తం 10 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. గ్రాండ్ మాస్టర్ పొందిన ముగ్గురు క్రీడాకారులు, ఇంటర్నేషనల్ మాస్టర్ పొందిన ముగ్గురు క్రీడాకారులు, ఫెడరేషన్ మాస్టర్‌లు ఇద్దరు పాల్గొన్నారు. భారత దేశం నుంచి పాల్గొన్న పలువురిలో అజయ్ సంతోష్ ఒకరు. కాగా పోటీల్లో మొత్తం 9 పాయింట్లకు గాను 5 పాయింట్లు సాధించి ఇంటర్నేషనల్ మాస్టర్‌కు అర్హత సాధించాడు. తొమ్మిది మందితో గేమ్‌లు ఆడి ఐదుగురిపై విజయం సాధించి 5 పాయింట్‌లు సాధించాడు. అజయ్ సంతోష్ ఇప్పటి వరకు 2024లో జెకోస్లోవేకియాలోని పియస్టసీ ఓపెన్ ఇంటర్నేషనల్ చెస్ ఫెడరేషన్‌లో రేటింగ్ పొంది, మొదటి ఇంటర్నేషనల్ మాస్టర్ సాధించాడు. 2025 ఫ్రాన్స్‌లో డోలే ఓపెన్ టెస్ట్ టోర్నమెంట్‌లో విజయం సాధించి రెండో ఇంటర్నేషనల్ మాస్టర్ సాధించగా, ప్రస్తుతం సాధించినది మూడోది. 2024లో శ్రీలంకలో నిర్వహించిన కామన్‌వెల్త్ యూత్ చాంపియన్ షిప్ పోటీల్లో అండర్ - 18 ఓపెన్ బ్లిట్జ్ విభాగంలో రెండు బంగారు పతకాలు, ఒక వెండి పతకం గెలిచాడు.

‘నులి’మేద్దాం

ఒక్క మాత్రతో నులి పురుగులను చంపేయవచ్చు

నులి పురుగులు పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. అనేక రకాల అనారోగ్యాలకు కారణమవుతున్న నులి పురుగులను కేవలం ఒకే మాత్ర అల్బెండజోల్‌తో నివారించవచ్చు. ప్రభుత్వం ఈ నెల12న జిల్లా వ్యాప్తంగా ఉచితంగా నులి పురుగుల నివారణ కోసం మాత్రలను పంపిణీ చేయనుంది. 12న జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ‘సాక్షి’ అందిస్తున్న ప్రత్యేక కథనం.

- గుంటూరు జిల్లా వ్యాప్తంగా మాత్రలు ఉచితంగా పంపిణీ
- 12న జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం

గుంటూరు మెడికల్ : నులి పురుగులు చిన్నారుల్లో రక్తహీనతకు దారితీస్తాయి. శారీరక, మానసిక ఎదుగుదలకు ఆటంకంగా మారతాయి. కడుపు లోపల చేరి నొప్పి, మంట, వికారం కలుగచేస్తాయి. దీని వల్ల ఆహారం సహించదు. ఆకలి ఉండదు. పిల్లలు నీరసపడతారు. శారీరక, మానసిక ఎదుగుదల లోపాలను కలిగి ఉంటారు. వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. వాంతులు, మలంలో రక్తం, అతిసారం వంటి సమస్యలు ప్రబలుతాయి. ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు పిల్లల్లో నులి పురుగుల సమస్య ఎక్కువగా ఉంటుంది. అపరిశుభ్రత వల్లే నులి పురుగులు ఎక్కువగా వ్యాపిస్తాయి. పిల్లలు చేతి గోళ్లను శుభ్రంగా ఉంచుకోవాలి. లేకుంటే వాటిల్లో పేరుకున్న మట్టి ద్వారా నులి పురుగులు శరీరంలోకి ప్రవేశిస్తాయి. కలుషిత నీరు, బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన వల్ల కూడా నులి పురుగులు శరీరంలోకి చేరతాయి. కూరగాయలను కడగక పోవటం, భోజనం చేసే ముందు చేతులు కడుక్కోకపోవటం, ఆహార పదార్థాలపై మూతలు లేకపోవటం వల్ల కూడా నులి పురుగుల ప్రభావం ఉంటుంది.



డీవార్మింగ్ పోస్టర్

మాత్రల డోస్ ఇలా...

ఏడాది నుంచి రెండేళ్లలోపు చిన్నారులకు ఆల్బెండజోల్ సగం మాత్ర (200 మిల్లీ గ్రాములు) నీళ్లలో కలిపి పట్టించాలి. ఇక 2 నుంచి 19 ఏళ్లలోపు వారికి మాత్రం 400 మిల్లీ గ్రాముల మాత్రను మధ్యాహ్నం భోజనం తిన్న తర్వాత ఇచ్చి, చప్పరించేలా చూడాలి. మాత్రను మింగకుండా పర్యవేక్షించాలి. సిబ్బంది పర్యవేక్షణలో మాత్రలు నమిలించేలా చూడాలి.

శంకర్‌విలాస్ బ్రిడ్జి కూల్చివేత పనులు ప్రారంభం

గుంటూరు ఎడ్యుకేషన్ : గుంటూరు నగరంలోని శంకర్‌విలాస్ బ్రిడ్జి కూల్చివేత పనులను ఆర్ అండ్ బీ శాఖాధికారులు శనివారం ప్రారంభించారు. ఉదయం నుంచే జేసీబీలతో శంకర్‌విలాస్ వైపు నుంచి కూల్చివేత పనులు మొదలుపెట్టారు. దాదాపు 70 ఏళ్లుగా నగరంలో ప్రజా రవాణాకు కీలకంగా మారి, సేవలందించిన ఈ బ్రిడ్జి కూల్చివేత పనులు ప్రారంభించడంతో స్థానికంగా వ్యాపారాలు నిర్వహిస్తున్న వారితోపాటు బాటసారులు, ఆటో కార్మికులు, వివిధ వర్గాల ప్రజలు భావోద్వేగానికి లోన వుతున్నారు. బ్రిడ్జితో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుని, అక్కడకు వచ్చి సెల్ఫీలు తీసుకుని జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. యుద్ధ ప్రాతిపదికన పనులను ప్రారంభించిన అధికారులు సాయంత్రం వరకు నిరంతరాయంగా పనులు చేయించారు. నూతన బ్రిడ్జి నిర్మాణ పనులకు ఆటంకం కలగకుండా పర్యవేక్షిస్తున్నారు.

క్లుప్తంగా

సీనియర్ మెన్స్ ఫుట్‌బాల్ లీగ్ నేడు

చీరాల రూరల్: బాపట్ల జిలా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్లమల జోన్ (బాపట్ల, ప్రకాశం, గుంటూరు, పల్నాడు) జిల్లాల సీనియర్ ఫుట్‌బాల్ లీగ్ ఆదివారం ఉదయం 8 గంటల నుంచి చీరాల్లోని ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూలు క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు బాపట్ల జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వి. విజయ్‌కుమార్, కోఆర్డినేటర్ ఎన్. దేవదాసు, సమ్మర్ ఫుట్‌బాల్ క్యాంప్ ఇన్‌చార్జ్ బి. ప్రేమయ్య శనివారం తెలిపారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో గెలుపొందినవారు ఈనెల విశాఖపట్టణంలో జరిగే రాష్ట్ర స్థాయి సీనియర్స్ మెన్స్ ఫుట్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు 6304338205, 9490335238 నంబర్లను సంప్రదించాలని కోరారు.

అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

చీరాల: స్థానిక వీఆర్ఎస్‌వైఆర్ఎన్ కళాశాలలో 36వ అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. పోటీలను ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ప్రారంభించారు. పోటీలకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. మూడు రోజుల పాటు బాపట్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న పోటీల్లో 1500 మంది బాలబాలికలు పాల్గొన్నారు. చీరాల్లో మొదటిసారిగా రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించడంతో పోటీలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు హాజరయ్యారు. చీరాల ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్దన్, కాలేజీ ప్రిన్సిపాల్ పి.రవికుమార్, బాపట్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు అరుణ్ పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

బల్లికురవ: బాలికకు (18) మాయమాటలు చెప్పి లొంగదీసుకుని గర్భిణిని చేసిన ఘటనపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. బాపట్ల జిల్లా బల్లికురవ మండలం వెలమవారిపాలెం పంచాయతీలోని జమ్ములమడక కాలనీకి చెందిన గద్దల హనుమంతు అదే గ్రామానికి చెందిన బాలికను గర్భవతిని చేశాడు. దీంతో బాధితురాలు ఒంగోలు జీజీహెచ్ వైద్యశాలకు వెళ్లి చికిత్స పొందుతూ ఫిర్యాదు చేసింది.

దోమల నివారణకు చర్యలు చేపట్టాలి

ప్రత్యేక అధికారి, డిప్యూటీ కలెక్టర్ లవన్న



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ లవన్న

పర్చూరు(చినగంజాం): దోమల నివారణకు చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి, డిప్యూటీ కలెక్టర్ ఎస్. లవన్న పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శనివారం మండలంలోని చెరుకూరు, రమణాయపాలెం, అడుసుమల్లి, బోడవాడ గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి మండల అధికారులతో కలిసి సందర్శించారు. చెరుకూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, నీరు, మురుగు నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని, పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని సూచించారు. సిబ్బంది దోమల లార్వా నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మురుగు నీరు నిలువ ఉన్నచోట ఆయిల్ బాల్స్, గ్రామాల్లో ఫాగింగ్ చేపట్టాలని సూచించారు, రమణాయపాలెం గ్రామంలో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని సందర్శించి సిబ్బందికి ప్రతి రోజూ గ్రామాల్లో చెత్తను తొలగించాలంటూ పలు సూచనలు చేశారు. బోడవాడ గ్రామంలో నీటి పథకాన్ని సందర్శించి ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలని, ట్యాంకులు, చెరువుల్లో ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలని తెలిపారు. అడుసుమల్లి గ్రామంలో ఇంటింటికీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎక్కడైనా జ్వరాలున్నట్లయితే మండలాధికారులు, వైద్యాధికారులకు తెలియజేయాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓ వి. ప్రద్యుమ్నకుమార్, డిప్యూటీ ఎంపీడీఓ కె. సత్యనారాయణ, చెరుకురు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గౌతం, రమణాయపాలెం, బోడవాడ కార్యదర్శులు హరిప్రసాద్, వెంకటేష్, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌పై కానిస్టేబుల్ దాడి

- తనిఖీలలో బైక్ ఆపలేదనే కోపంతో నాగిరెడ్డిపాలెం మాజీ సర్పంచ్‌పై లాఠీ విసిరేసిన కానిస్టేబుల్
- బాధితుడి తలకు గాయమై తీవ్ర రక్తస్రావం
- దాడికి నిరసనగా నాగిరెడ్డిపాలెం రహదారిపై బాధితుడి కుటుంబ సభ్యుల బైఠాయింపు



గాయంతో రోడ్డుపై పడుకున్న బాధితుడు మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు



బాధితుడి బంధువులకు సర్ది చెబుతున్న పెదకూరపాడు సీఐ సురేష్

బెల్లంకొండ: వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో బైక్ ఆపలేదనే కోపంతో మాజీ సర్పంచ్‌పై ఓ కానిస్టేబుల్ లాఠీ ఝుళిపించారు. ఈ ఘటన శనివారం సాయంత్రం మండలంలోని నాగిరెడ్డిపాలెం సమీపంలో చోటు చేసుకుంది. బాధితుడు నాగిరెడ్డిపాలెం మాజీ సర్పంచ్ కొజ్జా శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంకొండ క్రాస్ రోడ్డు నుంచి బైక్‌పై నాగిరెడ్డిపాలెం వస్తుండగా గంగమ్మ గుడి సమీపంలో కానిస్టేబుళ్లు వాహనాల తనిఖీ చేపడుతున్నారు. బైక్ ఆపకుండా ముందుకు వెళ్లడంతో తనిఖీ చేస్తున్న కానిస్టేబుళ్లలో ఒకరు శ్రీనివాసరావుపై లాఠీ విసిరారు. దీంతో ముఖంపై గాయమై రక్తస్రావం అయింది. ఊర్లోకి గాయంతో వచ్చిన శ్రీనివాసరావును చూసి కుటుంబ సభ్యు లు, గ్రామస్తులు నాగిరెడ్డిపాలెం ప్రధాన రహదారిపై నిరసనకు దిగారు. రెండు గంటలపాటు రోడ్డుపై బైఠాయించారు. విషయం తెలుసుకున్న క్రోసూరు, సత్తెనపల్లి సీఐలు ప్రత్తిపాటి సురేష్, కిరణ్‌లు నాగిరెడ్డిపాలెం వచ్చి బాధితుడికి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. దాడి చేసిన కానిస్టేబుల్ రావాలని, కొట్టడానికి గల కారణం చెప్పాలని బాధితుడి కుటుంబ సభ్యులు భీష్మించుకుని కూర్చున్నారు. వాహనాల రాకపోకలు నిలిచిపోయాయని, పోలీస్‌స్టేషన్లో మాట్లాడదామని సీఐలు సర్ది చెప్పారు. బాధితుడు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. గంటపాటు వారితో పోలీసులు మంతనాలు సాగించారు. బాధితుడిని వైద్యశాలకు పంపారు.

లారీ ఢీకొని ఉపాధ్యాయుడు మృతి



రేపల్లె: ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి పెనుమూడి–పులిగడ్డ వారధిపై చోటుచేసుకుంది. రేపల్లె పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల మేరకు.. నిజాంపట్నం మండలం ప్రజ్ఞాం గ్రామానికి చెందిన పుప్పాల శ్రీనివాస్(55) పట్టణంలోని ట్రిబుల్ ఎక్స్ హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ స్కూల్ సమీపంలోనే నివాసం ఉంటున్నాడు. శ్రీనివాస్ ద్విచక్ర వాహనంపై శనివారం రాత్రి పులిగడ్డ వైపు నుంచి రేపల్లె వారధిపై వస్తుండగా రేపల్లె నుంచి పులిగడ్డ వైపు వెళ్తున్న లారీ అతివేగంగా ఢీ కొట్టిందన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వారధిపై లైటింగ్ సౌకర్యం లేకపోవడంతోనే ప్రమాదం సంభవించిందని స్థానికులు పేర్కొంటున్నారు.

30, 31వ తేదీల్లో రాష్ట్ర స్థాయి పికిల్ బాల్ పోటీలు



గుంటూరు వెస్ట్ (క్రీడలు) : జిల్లా పికిల్ బాల్ అసోసియేషన్, ఏపీ పికిల్ బాల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 30, 31వ తేదీల్లో రాష్ట్ర స్థాయి పికిల్ బాల్ పోటీలు నిర్వహిస్తామని జిల్లా చీఫ్ టి.అరుణ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–14, 16, 19 బాలబాలికలతోపాటు ఓపెన్ విభాగంలో 35+, 50+, 60+ పురుషులు, మహిళల విభాగాల్లోనూ పోటీలు ఉంటాయన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే క్రీడాకారులకు ఉచిత భోజన సదుపాయాలు ఏర్పాటు చేస్తామన్నారు. పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను చిగురుపాటి రవీంద్రబాబు, జీవీఎస్ ప్రసాద్, అరుణ్ కుమార్ తదితరులు ఆవిష్కరించారు.

భార్యపై కత్తితో దాడి చేసిన భర్త

వైద్యశాలకు తరలిస్తుండగా మృతి



సుబ్బమ్మ మృతదేహం

సంతమాగులూరు (అద్దంకి): భార్యపై భర్త కత్తితో దాడి చేసిన ఘటనలో ఆమెను వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందింది. ఈ దారుణం సంతమాగులూరు మండలం ఏల్చూరులో శుక్రవారం రాత్రి జరగ్గా.. శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామానికి చెందిన సల్లూరి సుబ్బమ్మ, మేరీబాబుకు ముగ్గురు సంతానం. ఆమె తన భర్తతో గొడవల కారణంగా పదేళ్ల నుంచి విడిపోయి అదే గ్రామంలోని తన అన్న గేరా ఆంజనేయులు ఇంటి వద్ద తన ముగ్గురు పిల్లలతో పాటు నివాసం ఉంటోంది. ఈ క్రమంలో ఆమె పెద్ద కుమార్తె కృష్ణకుమారిని, వారం రోజుల కిందట చీమకుర్తి మండలంలోని మంచికలపాడుకు చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేసింది. తన ఇద్దరు అబ్బాయిల్లో సల్లూరి రవీంద్రబాబు తొమ్మిదో తరగతి, సల్లూరి నాగాంజనేయులు ఆరో తరగతి చదువుతున్నారు. వీరిరువురు అద్దంకిలోని ఎస్సీ హాస్టల్లో ఉంటున్నారు. శుక్రవారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో సల్లూరి సుబ్బమ్మ (35), చిన్న కుమారుడు నాగాంజనేయులు తమ ఇంటి బయట అన్నం తింటున్నారు. భర్త మేరీబాబు వచ్చి ఆమెతో గొడవ పెట్టుకుని కత్తితో తల మీద నరికాడు. ఆమె కేకలు వేయగా, చుట్టుపక్కల వారు వచ్చేసరికి అతను అక్కడ నుంచి పారిపోయాడు. ఈ విషయాన్ని ఆమె కుమారుడు నాగాంజనేయులు తన మామయ్య గేరా ఆంజనేయులుకు సమాచారం అందించాడు. క్షతగాత్రురాలిని 108 అంబులెన్స్‌లో నరసరావుపేటలోని మహాత్మాగాంధీ హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలలో ఉంచారు. మేరీబాబు తన భార్యతో విడిపోయిన తర్వాత కూడా అప్పుడప్పుడు ఆమె వద్దకు మందు తాగి వెళ్లి ఆమెపై అనుమానంతో ఘర్షణ పడుతుండేవాడని తెలుస్తోంది.

ఇద్దరు చైన్ స్నాచర్స్ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ హనుమంతురావు, పక్కన సత్తెనపల్లి టౌన్ సీఐ నాగమల్లేశ్వరరావు

సత్తెనపల్లి: చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ఇరువురుని పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు వివరాలను వెల్లడించారు. చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురు నిందితుల్లో ఇద్దరిని పట్టణ పోలీసులు అరెస్టు చేశారన్నారు. పార్కు రోడ్‌లో ఒంటరిగా ఉన్న ఓ వృద్ధ మహిళను కొట్టి గాయపరిచి ఆమె మెడలో రూ.3.42 లక్షలు విలువ చేసే 36.3 గ్రాముల బంగారు గొలుసు అపహరించి రెండు వేర్వేరు ప్రాంతాల్లో విక్రయించడం జరిగిందన్నారు. పలు సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా చైన్‌స్నాచింగ్ చేసే దొంగలను పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి పూర్తి బంగారం రికవరీ చేశామని, రెండు మొబైల్ ఫోన్లు, హీరో ప్యాషన్ ప్లస్ బైక్ స్వాధీన పరుచుకున్నామన్నారు. ఇరువురిని కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారన్నారు. మరొకడిని పట్టుకోవాల్సి ఉందన్నారు. ఈ కేసులో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి త్వరితగతిన కేసు ఛేదించిన పట్టణ సీఐ ఎన్. నాగమల్లేశ్వరరావు, పట్టణ ఎస్ఐ పవన్‌కుమార్, ఇతర పోలీస్ సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. వారికి ఈ నెల 15న జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అవార్డు లు అందించటం జరుగుతుందన్నారు. సమావేశంలో పట్టణ సీఐ ఎస్. నాగమల్లేశ్వర రావు, పట్టణ ఎస్ఐ పవన్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

మృత్యువులోనూ వీడని బంధం

- ఆత్మహత్య చేసుకున్న స్నేహితుడిని చూసేందుకు వెళ్లి గాయపడిన ఇద్దరు యువకులు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒకరి మృతి మరొకరి పరిస్థితి విషమం



షేక్ సాదిక్ (ఫైల్)



శివకోటి (ఫైల్)

పెదకాకాని: ఆత్మహత్య చేసుకున్న స్నేహితుడి అంత్యక్రియలకు వెళ్లి ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఓ యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. గుంటూరు అరుంధతీనగర్‌కు చెందిన షేక్ సాధిక్ (21) గడ్డిపాడు సమీపంలోని మహేంద్ర షోరూంలో పని చేస్తున్నాడు. ఈనెల 6న స్నేహితుడు రమణను బైక్‌పై ఎక్కించుకుని గుంటూరు నుంచి తెనాలి వయా నందివెలుగు మీదుగా బయలు దేరారు. మార్గంమధ్యంలో తక్కెళ్లపాడు శివారులోకి చేరుకునేసరికి ఎదురుగా వెళుతున్న లారీ షడన్ బ్రేక్ వేయడంతో దాన్ని ఢీకొట్టారు. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న షేక్ సాదిక్‌తో పాటు వెనుక కూర్చున్న రమణకు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరినీ గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వారిలో షేక్ సాధిక్(21) పరిస్థితి విషమించి శుక్రవారం మరణించాడు. మరో యువకుడు రమణ పరిస్థితి విషమంగా ఉంది. మృతుని తండ్రి షేక్ హన్ను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ టి.పి. నారాయణస్వామి తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

అంత్యక్రియలకు వెళ్లి వస్తూ అనంత లోకాలకు..

ప్రేమో, శారీరక ఆకర్షణో తెలియదు గానీ పట్టుమని 18 ఏళ్లు కూడా నిండని గుంటూరు ఆర్‌టీసీ కాలనీకి చెందిన కొండూరు శివశంకర్ నందివెలుగు రోడ్డులో ఉన్న రైల్వే ట్రాక్ పైకి చేరుకున్నాడు. సోదరుడికి ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు మాట్లాడుతూనే రైలు బండి కింద పడటంతో శరీరం ముక్కలైంది. ఈనెల 6న కుటుంబసభ్యులు శివశంకర్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు తెనాలి బయలు దేరారు. మిత్రుడి పోస్టుమార్టం పూర్తయ్యే వరకూ ప్రాణస్నేహితులు షేక్ సాధిక్, రమణలు అక్కడే గడిపారు. కడసారి చూసి కన్నీటి వీడ్కోలు పలికేందుకు మృతదేహం వెంట తెనాలి బయలు దేరారు. ఇంతలోనే లారీ రూపంలో వెంటాడిన మృత్యువు సాధిక్‌ను కబళించింది. మరో మిత్రుడి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన రెండు కుటుంబాల్లో విషాదం నింపింది.

కృష్ణా జిల్లాలో నరసరావుపేట యువకుడు మృతి

నిడమానూరు జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం



షేక్ మహ్మద్ హారీస్ (ఫైల్)

నరసరావుపేట టౌన్: నరసరావుపేట యువకుడు కృష్ణా జిల్లాలోని జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. ఇస్లాంపేటకు చెందిన షేక్ మహ్మద్ హారీస్(25) ఏలూరులోని స్టేట్ బ్యాంక్ క్రెడిట్ కార్డు విభాగంలో ఉద్యోగం చేస్తున్నాడు. ద్విచక్ర వాహనంపై ఏలూరు నుంచి విజయవాడ బయలుదేరాడు. మార్గమధ్యంలోని నిడమానూరు జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొంది. సంఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు. హారీస్ తండ్రి దరియావలి ఇస్లాంపేటలో రేషన్ డీలర్‌గా వ్యవహరిస్తుంటాడు. చేతికి అందివచ్చిన ఒక్కగానొక్క కుమారుడు చనిపోవటంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది.

కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి బలవన్మరణం

చిలకలూరిపేట టౌన్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో జరిగింది. నాదెండ్ల మండలం గణపవరం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ప్రత్తిపాటి రమేష్(33) కొంత కాలంగా చిలకలూరిపేట పట్టణంలోని ఆదిఆంధ్రా కాలనీలో ఉంటున్నారు. రమేష్ భార్యను మద్యం నిమిత్తం డబ్బులు ఇవ్వాలంటూ కోరాడు. అయితే అందుకు ఆమె నిరాకరించడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. తర్వాత భర్తకు టిఫిన్ తీసుకువచ్చేందుకు భార్య రాహేలు బయటకు వెళ్లి తిరిగి రాగా తలుపు వేసి ఉండటంతో తెరిచి చూడగా భర్త సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. దీంతో పోలీసులు అనుమానాస్పద కేసుగా నమోదు చేసుకున్నారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

సంక్షుభిత వేళ సాహితీవేత్తలపై బృహత్తర కర్తవ్యం

‘అల్లిక’ పుస్తకావిష్కరణ సభలో అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ



పుస్తకాన్ని ఆవిష్కరించిన పెనుగొండ, పక్కన స్వరూపరాణి

తెనాలి: ప్రపంచంలో ప్రమాదకర పరిణామాలు జరుగుతున్న సందర్భంలో సాహితీవేత్తలపై గొప్ప కర్తవ్యాలు ఉన్నాయని ‘అరసం’ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుగ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. కశ్మీర్‌లో కొన్ని గ్రంథాలను నిషేధించారని చెబుతూ రచయితలు, సాహితీవేత్తలపై అప్రకటిత నిషేధం, అక్రమ అరెస్టులు దారుణమన్నారు. ‘అరసం’, తెనాలి శాఖ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఏర్పాటైన సభలో ప్రముఖ దళిత స్త్రీవాద రచయిత్రి ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి కవితా సంపుటి ‘అల్లిక’ను లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. సభకు జిల్లా ఉపాధ్యక్షుడు కనపర్తి బెన్‌హర్ అధ్యక్షత వహించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో నిషేధాలు, అరెస్టులు కొత్త కాదన్నారు. చీకట్లోకి వెళుతున్న ఈ దేశాన్ని వెలుగులోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అన్ని రకాల అమానవీయతలతోపాటు యువత గంజాయికి, మత్తుకు బానిసలవుతుంటే దేశం ఏమవుతుంది? మరోవైపు మనుషుల మధ్య ప్రేమరాహిత్యం కూడా ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. ఈ నేపథ్యంలో సొంతూరు పాపర్రు నుంచి ఇజ్రాయెల్ వరకు అంశాలతో స్వరూపరాణి రాసిన కవితల్లో ప్రాపంచిక, తాత్విక దృష్టి రెండూ కనిపించాయన్నారు.

- బహుజన రచయితల వేదిక డాక్టర్ నూకతోటి రవికుమార్ మాట్లాడుతూ మన బతుకుల్ని మనల్నుంచి లాగేసుకుంటున్నపుడు మాట్లాడకపోవటం చారిత్రక ద్రోహం అవుతుందన్నారు.
- ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి మాట్లాడుతూ స్వరూపరాణి కవితల్లోని అంశాలనువిశదీకరించా రు.
- కవయిత్రి స్వరూపరాణి మాట్లాడుతూ తనతోటి అణగారిన వర్గాల ప్రజల కష్టాలు, కన్నీళ్లు, చెమట కలిసినవే తన అక్షరాలుగా చెబుతూ, వివక్ష ఉన్నంతవరకూ రాస్తూనే ఉంటానని స్పష్టం చేశారు.